క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మ పెద్దరాజుల కల్యాణం

ఎమ్మెల్యే హరీశ్‌రావు పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని విట్టలాపూర్ గ్రామంలో పెద్దమ్మ పెద్దరాజుల కల్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ దయతో ఈ ప్రాంతం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు నవీన్, మహేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణ రక్షణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

బెజ్జంకి(సిద్దిపేట): ద్విచక్ర వాహదారులు తప్పనిసరిగా హెల్మెట్‌లు ధరించి తమ ప్రాణాలు కాపాడుకోవాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో శుక్రవారం ఆయన హెల్మెట్‌ల ధారణ– ఆవశ్యకతను వివరిస్తూ రూపొందించిన కరపత్రాలను తోటి ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెల్మెట్ ధరించకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని, జాగ్రత్తలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని సూచించారు. కార్యక్రమంలో వీవీ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సుధాకర్ రెడ్డి, శంకరాచారి, రాజేందర్, షాబొద్దిన్, నర్సింహారెడ్డి, రూప, రేణుక, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థులకు నైపుణ్య శిక్షణ



నరసింహాచారి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో చదువుకున్న పూర్వ విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనుందని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ పాలోజు నరసింహాచారి శుక్రవారం తెలిపారు. 2017 నుంచి విద్యనభ్యసించి, ఇప్పటి వరకు ఉద్యోగం పొందని 18 నుంచి 25 యేళ్ల యువతీ, యువకులు ఈ శిక్షణకు అర్హులని చెప్పారు. ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించే అవకాశం ఉంటుందని, ఈ అవకాశాన్ని పూర్వ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఏఎంసీ సభ్యుల స్టడీ టూర్



నిజామాబాద్ మార్కెట్‌లో కృష్ణ తదితరులు

బెజ్జంకి(సిద్దిపేట): మార్కెట్‌లలో క్రయ, విక్రయాలు, రైతులకు కల్పిస్తున్న వసతుల గురించి పరిశీలించేందుకు బెజ్జంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు శుక్రవారం స్టడీ టూర్ నిర్వహించారు. జగిత్యాల జిల్లా మెట్‌పెల్లి, నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఆయా కమిటీ సభ్యులతో మాట్లాడి మార్కెట్‌లలో అమలు చేస్తున్న విధానాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, డైరెక్టర్‌లు మల్లేశం, పోచయ్య, సంతోష్, చంద్రారెడ్డి, నర్సయ్య, అనిల్ పాల్గొన్నారు.

27న హాఫ్ మారథాన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజు తదితరులు

మిరుదొడ్డి(దుబ్బాక): సిద్దిపేట రంగనాయక సాగర్ ప్రాజెక్టు నుంచి 27న జరిగే హాఫ్ మారథాన్‌ను విజయవంతం చేయాలని సిద్దిపేట రన్నర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నునిగాని రాజు పిలుపునిచ్చారు. మిరుదొడ్డి పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐ శేఖర్‌తో కలిసి శుక్రవారం మారథాన్ వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఉత్సాహవంతులైన వారంతా పాల్గొనాలన్నారు. ఆసక్తి కలిగిన వారు మారథాన్ లింక్ ద్వారా పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. మారథాన్ నిర్వాహకులు రమేశ్, వెంకట్, దశరథం, కుమార్, స్వామి, పరశురాములు, విజయ్, సురేశ్ పాల్గొన్నారు.

పల్లెపల్లెకు పచ్చని హారం



నర్సరీని పరిశీలిస్తున్న అధికారులు



గంగాపూర్ నర్సరీలోని మొక్కలు

నర్సరీలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- 90 వేల మొక్కలు పెంచడమే లక్ష్యం
- పండ్లు, పూల మొక్కలకు అధిక ప్రాధాన్యం
- ఈ సారి ఈత మొక్కలు కూడా..

మర్కూక్(గజ్వేల్): పల్లెల్లో పచ్చని వనాలను పెంచాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు నర్సరీలను పరిశీలిస్తున్నారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కలను గ్రామాలలో పంపిణీ చేసేందుకు సిద్ధం చేస్తున్నారు. అందుకోసం ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చుచేస్తోంది. ప్రతి గ్రామంలో లక్ష్యానికి మించి మొక్కలు నాటాలనే ఉద్దేశ్యంతో గ్రామానికి ఒక నర్సరీని ఏర్పాటు చేసి వాటిలో మొక్కలను పెంచడానికి అధికారులను ఆదేశించింది.

మొక్కల పెంపకం ఇలా..

మండలంలోని 16 గ్రామ పంచాయతీలలో 11వ విడతలో భాగంగా నర్సరీలలో మొక్కలను పెంచుతున్నారు. చిన్న గ్రామ పంచాతీలలో మూడు నుంచి ఐదు వేల మొక్కలను, పెద్ద గ్రామ పంచాయతీలలోని నర్సరీల్లో 5 నుంచి 10 వేల మొక్కలను పెంచుతున్నారు. మండలంలో 90 వేల మొక్కలను పెంచే లక్ష్యంతో పనిచేస్తున్నారు.

పండ్లు, పువ్వులకు ప్రాధాన్యం

నర్సరీలలో దానిమ్మ, జామ, నిమ్మ, ఉసిరి, సీతాఫలం, మామిడి, బొప్పాయి లాంటి పండ్ల మొక్కలు, మందారం, గన్నేరు, గులాబి, ఈత, కానుగ, మల్లె వంటి పువ్వుల మొక్కలతో పాటు మునగ, చింత లాంటి వాటిని సిద్ధం చేస్తున్నారు. ప్రతిరోజు గ్రామ కార్యదర్శులు నర్సరీలను సందర్శించి మొక్కల సస్యరక్షణకు చర్యలు తీసుకుంటున్నారు.

16 నర్సరీల్లో ఈత మొక్కలు..

ఈ సంవత్సరం మర్కూక్ మండలంలో 16 గ్రామ పంచాయతీలలోను ఈత మొక్కలను కూడా పెంచుతున్నారు. చిన్నచిన్న గ్రామ పంచాయతీల్లో కూడా ఏర్పాటు చేసిన నర్సరీల్లో 80 శాతానికి పైగా మొక్కలను సంరక్షించేందుకు ఎప్పటికప్పుడు అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పచ్చగా తీర్చిదిద్దుతాం..

ప్రతి పల్లెను పచ్చగా తీర్చిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. ఎప్పటికప్పుడు గ్రామ కార్యదర్శులు, ప్రజా ప్రతినిధులు నర్సరీలో పెంచుతున్న మొక్కలను పరిశీలిస్తున్నారు. పండ్లు, పూల మొక్కలపైనే దృష్టి సారించాం. ఈ సారి భిన్నంగా ఈత మొక్కలను కూడా పెంచుతున్నాం. మర్కూక్ మండలాన్ని ఆకు పచ్చని మండలంగా తీర్చిదిద్దేందుకు శతశాతం కృషి చేస్తున్నాం.

– అశోక్, ఇన్‌చార్జి ఎంపీడీఓ

నాటేందుకు ఏర్పాట్లు

ప్రతి నర్సరీలో 16 రకాల పండ్లు, పూల మొక్కలను పెంచుతున్నారు. మండలంలో 90 వేల మొక్కలను పెంచి రోడ్లకు రెండు పక్కల, ఖాళీ ప్రదేశాలలోను నాటేందుకు అధికారులు దృష్టి సారించారు. త్వరలోనే ప్రతి గ్రామంలో వాటిని నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.



పెరుగుతున్న ఈత మొక్కలు



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అక్షర వేషధారణతో ఉపాధ్యాయుడు సయ్యద్ సందాని

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్ఆర్‌పీ భానుప్రకాశ్



సిద్దిపేటరూరల్: మాట్లాడుతున్న భానుప్రకాశ్

సిద్దిపేటరూరల్: తెలుగు ఉపాధ్యాయులకు ఐదు రోజుల పాటు అందించనున్న శిక్షణ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్‌పీ భానుప్రకాశ్ సూచించారు. మండల పరిధిలోని ఇర్కోడ్ మోడల్ స్కూల్‌లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఎంఈఓ రాజిరెడ్డితో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడ నేర్చుకున్న విషయాలను ఉపాధ్యాయులు పాఠశాలల్లోని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. డీసీఈబీ సెక్రెటరీ షౌకత్‌అలీ, డీఆర్‌పీలు అంజిరెడ్డి, బైరారెడ్డి, సుధాకర్, శైలజ, శ్రీనివాస్, పరమేశ్వరచారి, రాజశేఖరశర్మ, కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

విద్యావికాసానికి బాటలు వేయాలి

వర్గల్(గజ్వేల్): ఉపాధ్యాయులు విద్యావికాసానికి బాటలు వేయాలని మెదక్ డైట్(ఉపాధ్యాయ శిక్షణ సంస్థ) విశ్రాంత ప్రిన్సిపాల్, ప్రముఖ మనోవిజ్ఞాన శాస్త్ర ఉపన్యాసకులు రమేశ్‌బాబు పిలుపునిచ్చారు. వర్గల్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి శుక్రవారం ఆయన ప్రధాన వక్తగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ అత్యంత నైపుణ్యం కలిగిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రైవేటుకు ధీటు అనే భావన విడనాడాలన్నారు. అది మనకు మనం తక్కువ చేసుకోవడమేనని చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ సునీత, కాంప్లెక్స్ హెచ్‌ఎం కనకరాజు, ఆర్పీలు కనకయ్య, సుజాత, రాజనరేందర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆకట్టుకున్న అక్షర వేషధారణ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యార్థులకు సులువుగా తెలుగు నేర్పించేందుకు, అర్థం చేయించేందుకు తెలుగు ఉపాధ్యాయుడు సయ్యద్ సందాని అక్షర వేషధారణతో అందరినీ ఆకర్షించారు. ఇందిరానగర్‌లో ఉపాధ్యాయులకు అందిస్తున్న శిక్షణ కార్యక్రమంలో భాగంగా ఆయన అక్షర మాలను ధరించి పాఠ్యాంశాలు ఏ విధంగా బోధించాలో తోటి ఉపాధ్యాయులకు వివరించారు. మండల విద్యాధికారి రాజ ప్రభాకర్‌రెడ్డి, ఆర్పీలు కనకరాజు, ప్రశాంత్, రాకేశ్, దేవరాజ్, ఫసియొద్దీన్, వినోద్, జంపయ్య, శ్రీనివాస్, సరిత పాల్గొన్నారు.

బోధన పటిష్ఠం చేయడానికే..

అక్కన్నపేట(హుస్నాబాద్): ఉపాధ్యాయుల బోధనను మరింత పటిష్ఠం చేయడానికే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓ గుగులోతు రంగానాయక్ తెలిపారు. మండలంలోని అంతక్కపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన పద్ధతులను అవలంబించాలని సూచించారు.

విద్యార్థుల ఉన్నతికి కృషి చేయాలి

డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి



మిరుదొడ్డి(దుబ్బాక): మాట్లాడుతున్న డీఈఓ

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతి ఉపాధ్యాయుడు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మిరుదొడ్డి ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయ శిక్షణా కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దడానికి ఉపాధ్యాయ శిక్షణ ఎంతో దోహదం చేస్తుందన్నారు. జూన్ 6 నుంచి బడిబాట కార్యక్రమాన్ని విధిగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ ప్రవీణ్‌బాబు, మండల రిసోర్స్ పర్సన్ కృష్ణ మూర్తి, అమరేంద్ర చారి, కృష్ణ, చంద్రశేఖర్, నగేష్, శ్రీకాంత్, రమేష్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ బోధన అందించాలి

కోహెడ(హుస్నాబాద్): విద్యార్థులకు ఉత్తమ బోధన అందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈఓ అన్నారు. స్థానిక హైస్కూల్‌లో కొనసాగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగేలా ఉపాధ్యాయుల బోధన ఉండాలని సూచించారు.

తహసీల్దార్‌గా బాధ్యతలు



సమీర్ అహ్మద్‌ఖాన్

కోహెడ(హుస్నాబాద్): కోహెడ తహసీల్దార్‌గా సమీర్ అహ్మద్‌ఖాన్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన చేర్యాల నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇన్‌చార్జి తహసీల్దార్ దేవేంద్ర ఆయనకు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. సీనియర్ సహాయకులు రాములు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుడి కుటుంబాన్ని ఆదుకోండి

నంగునూరు(సిద్దిపేట): తాటిచెట్టుపై నుంచి పడి చికిత్స పొందుతున్న కార్మికుడి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్‌ఎస్ కార్మిక విభాగం మండల అధ్యక్షుడు గోనే సిద్దేశ్వర్‌గౌడ్ కోరారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బద్దిపడగకు చెందిన మధునాల గణేశ్‌గౌడ్ ఆటో నడిపేవాడని, మహాలక్ష్మి పథకంతో జీవనోపాధి కోల్పోవడంతో కులవృత్తి చేసుకుంటున్నాడన్నారు. ఈ క్రమంలో నెలరోజుల కిందట ప్రమాదవశాత్తు తాటిచెట్టుపై నుంచి గాయపడి కోలుకోలేదని, ఆ కుటుంబం ఇబ్బందులు పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో తమ సిబ్బందితో కలిసి వారం రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా శుక్రవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.24 వేలు జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

రైతులు గోస పడుతున్నా పట్టించుకోరా?

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



చేర్వాపూర్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి, వెంకటయ్య

దుబ్బాక: అకాల వర్షాలకు ధాన్యం తడిసి రైతులు హరిగోస పడుతున్నా ప్రభుత్వానికి చీమకుట్టినట్లు కూడా లేదని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి విమర్శించారు. చేర్వాపూర్, హబ్షీపూర్ గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్యతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. కొనుగోళ్లు నత్తనడకన సాగడం వల్లే ధాన్యం పేరుకపోయిందని, వానలకు తడిసిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

మహంకాళి విగ్రహ ప్రతిష్ఠాపనలో..

దుబ్బాకరూరల్: మండలంలోని హబ్సిపూర్ గ్రామంలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహంకాళి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట వెంకటయ్య, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

రైతులను మోసం చేస్తే చర్యలు తప్పవు

వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు



ఎరువుల దుకాణంలో పోలీసు, వ్యవసాయశాఖ అధికారుల తనిఖీ

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఎరువుల దుకాణదారులు రైతులను మోసం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు హెచ్చరించారు. సిద్దిపేట అర్బన్ ఏఈఓ శ్రీనాథ్‌తో కలిసి శుక్రవారం ఆయన జిల్లా కేంద్రంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించారు. నాసిరకం, కాలం చెల్లిన విత్తనాలు, పురుగు మందులు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు కూడా అప్రమత్తంగా ఉండి అధికారులు సూచించిన విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. ఎవరైనా నాసిరకం విత్తనాలు విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100, సంబంధిత పోలీస్ స్టేషన్, కంట్రోల్ రూం నంబర్ 87126 67100కు సమాచారం అందించాలని సూచించారు.

కార్యాలయాలు ఏర్పాటు చేయాలి

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్టలో మండల పరిషత్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను వెంటనే మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ మండలం ఏర్పడి ఐదేళ్లు గడుస్తున్నా పూర్తి స్థాయిలో మండల కార్యాలయాలు లేకపోవడం బాధాకరమన్నారు. దూల్మిట్ట నుంచి బైరాన్‌పల్లి, లింగాపూర్ నుంచి గాగ్గిల్లాపూర్ వెళ్లే కల్వర్టు బ్రిడ్జిలను పునర్నిర్మించాలని డిమాండ్ చేశారు. రవికుమార్, రాజు, మహేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతలను నష్టపర్చడం సరికాదు

సీపీఎం జిల్లా నేత ఎల్లయ్య

గజ్వేల్‌రూరల్: అన్నదాతలను ఆదుకోవాల్సింది పోయి, నష్టపరిచే విధంగా వ్యవహరించడం సరికాదని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సందబోయిన ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో సరిపడ గన్నీ సంచులను అందుబాటులో ఉంచడం లేదన్నారు. జగదేవ్‌పూర్ మండలం తిమ్మాపూర్‌లోని కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యాన్ని తడిచిన సంచుల్లో నింపడంతో రైస్ మిల్లుకు వెళ్లిన తర్వాత సంచికి మరో రెండు కిలోల చొప్పున తొలగించి ఓచర్లను రాస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. హమాలీ డబ్బులు సైతం రైతుల నుంచే వసూలు చేయడం సరికాదని, ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో స్వామి, రంగారెడ్డి, కనకయ్య పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



అక్కన్నపేటలో విత్తనాలు పంపిణీ చేస్తున్న అధికారులు

అక్కన్నపేట(హుస్నాబాద్)/హుస్నాబాద్‌రూరల్: సబ్సిడీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారులు తస్లీమా సుల్తానా, శ్రీనివాస్ సూచించారు. అక్కన్నపేట ఆగ్రో రైతుసేవా కేంద్రంలో శుక్రవారం తస్లీమా సుల్తానా రైతులకు విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 14 టన్నుల జీలుగ, రెండు టన్నుల జనుము విత్తనాలను కేటాయించారన్నారు. అలాగే పది టన్నుల జీలుగ విత్తనాలు ఏఆర్‌ఎస్‌కే అక్కన్నపేట, రామవరం, కట్కూర్ గ్రామాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అలాగే శ్రీనివాస్ మాట్లాడుతూ హుస్నాబాద్ ఆగ్రోస్, డీసీఎంఎస్ దుకాణాలలో 30 టన్నుల జీలుగ విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కావల్సిన రైతులు ఏఈఓల ధ్రువీకరణ పత్రాలు తెచ్చుకొని 30 కిలోల జీలుగ విత్తన బస్తాకు రూ.2,137, 40 కిలోల జనుము బస్తాకు రూ.2,510లు చెల్లించి తీసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి సబియా తదితరులు పాల్గొన్నారు.

‘ఆయిల్‌పామ్’ రైతులకు 90శాతం సబ్సిడీ



మార్కెట్‌కు తరలిస్తున్న ఆయిల్‌పామ్ గెలలు

మిరుదొడ్డి(దుబ్బాక): కొత్తగా ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తోందని ఆయిల్‌ఫెడ్ ఫీల్డ్ అధికారి ఆంజనేయులు అన్నారు. చెప్యాలలో మాజీ ఎంపీపీ గజ్జెల సాయిలు సాగుచేస్తున్న ఆయిల్‌పామ్ తోటను శుక్రవారం ఆయన పరిశీలించారు. కోతకు వచ్చిన ఆయిల్‌పామ్ గెలల కోత గురించి రైతులకు అవగాహన కలిగించారు. కోసిన గెలలను ఆయిల్‌ఫెడ్ మార్కెట్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకసారి కటింగ్ చేసిన తర్వాత 15 రోజులకో మారు గెలలను కట్ చేయాలన్నారు. ఎకరానికి ప్రతి యేడాది పది టన్నుల గెలల దిగుబడి సాధించవచ్చని, అంతర పంటగా కోకో సాగు చేయడం వల్ల అదనంగా రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు వంద శాతం సబ్సిడీతో పాటు, మొక్కల పంపిణీ జరుగుతుందని చెప్పారు. మార్కెటింగ్ సదుపాయం కూడా కల్పిస్తున్నామని చెప్పారు.

సంక్షిప్త వార్తలు

◆ మావోయిస్టులతో చర్చలు జరపాలి

సిద్దిపేటకమాన్: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని పౌరహక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం వివిధ పార్టీలు, విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ అనేక త్యాగాలకు ఓర్చి ఉద్యమిస్తున్న మావోయిస్టు పార్టీతో చర్చలు జరపాలన్నారు.

◆ చెడు ఆలోచనలకు తావివ్వొద్దు

హుస్నాబాద్: విద్యార్థులు చెడు ఆలోచనలకు తావివ్వకుండా చదువుపై దృష్టి పెట్టాలని ఏఎస్‌ఐ మణెమ్మ సూచించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్వాన్స్ సప్లమెంటరీ రాసేందుకు వచ్చిన విద్యార్థులకు శుక్రవారం మహిళల రక్షణకు ఉన్న చట్టాలు, సైబర్ నేరాలు, మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. షీ టీమ్ సభ్యులు సదయ్య, ప్రశాంతి, స్వప్న, కానిస్టేబుల్ కృష్ణ పాల్గొన్నారు.

◆ డబ్బులు జమచేయాలి

తొగుట(దుబ్బాక): పొద్దుతిరుగుడు ధాన్యం విక్రయించిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పీఏసీఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సుమారు రూ.3.28 కోట్లు జమచేయాల్సి ఉందని, నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. వైస్ చైర్మన్ యాదగిరి, డైరెక్టర్ శ్రీధర్, సీఈఓ గంగారెడ్డి పాల్గొన్నారు.

◆ నార్కోటిక్ డాగ్స్‌తో తనిఖీలు

దౌల్తాబాద్(దుబ్బాక): స్థానిక బస్‌స్టాండ్, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు, అనుమానస్పద ప్రాంతాల్లో పోలీసులు నార్కోటిక్ డాగ్స్‌తో శుక్రవారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. తొగుట సీఐ లతీఫ్ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలను అరికట్టడానికే ఈ తనిఖీలు నిర్వహించామన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలు కలిపిన చాక్లెట్స్ కలిగి ఉన్నా, రవాణా చేసినా, విక్రయించినా కేసులు నమోదు చేస్తానని హెచ్చరించారు.

◆ పేదింటి ఆడబిడ్డ పెళ్లికి ఆర్థిక సాయం



చేర్యాల(సిద్దిపేట): తండ్రి లేని పేద కుటుంబానికి చెందిన ఓ ఆడబిడ్డ పెళ్లికి ఉల్లెంగల సేవా ట్రస్ట్ చైర్మన్ ఉల్లెంగల ఏకానందం అండగా నిలిచారు. మండల పరిధిలోని కడవేర్గు గ్రామానికి చెందిన గదరాజు భాగ్యమ్మ, ఎల్లయ్య పెద్ద కూతురు సంధ్య వివాహం శనివారం జరగనుంది. ఈ క్రమంలో శుక్రవారం పెళ్లి కూతురు సంధ్యకు స్థానిక నాయకుల చేతుల మీదుగా నగదు అందజేశారు. కిరణ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ అవసరం

గజ్వేల్: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత చాలా కీలకమని కుకునూర్‌పల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అఖిల అన్నారు. రిమ్మనగూడ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ‘డ్రైడే–ఫ్రైడే’ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలువురి ఇళ్లను సందర్శించారు. పగిలిన కుండలు, టైర్లు, కొబ్బరి చిప్పల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడతామని, ప్రతి ఒక్కరు పరిసరాల పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలన్నారు. వైద్యారోగ్యశాఖ సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాస్, ఎంపీహెచ్‌ఓ ప్రేమ్‌చంద్, హెల్త్ అసిస్టెంట్ వాసుదేవ్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణారెడ్డి, ఏఎన్‌ఎం మంజుల, ఆశా వర్కర్లు హేమలత, దర్గమ్మ పాల్గొన్నారు.

◆ అందని అత్యవసర వైద్యం

కోహెడ(హుస్నాబాద్): స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో 24 గంటలు వైద్యసేవలు అందించాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు ఖమ్మం వెంకటేశం కోరారు. శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. 27 గ్రామాలకు ఉన్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సాయంత్రం ఐదు దాటితే వైద్యం అందడం లేదని, మంత్రి పొన్నం స్పందించి ప్రత్యేక వైద్యులను నియమించాలని కోరారు.

◆ ఘనంగా బోడ్రాయి ప్రతిష్ఠోత్సవాలు

మిరుదొడ్డి(దుబ్బాక): పండుగల సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని జంగపల్లిలో జరుగుతున్న బోడ్రాయి ప్రతిష్ఠోత్సవాల్లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వెంకట్‌స్వామి గౌడ్, భూమయ్య, భూపాల్‌రెడ్డి, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.